మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

# రాష్ట్రంలో బిజెపికే మెజార్టీ సీట్లు

**కరీంనగర్ తాజా మాజీ ఎంపి, బిజెపి అభ్యర్థి బండి సంజయ్‌కుమార్**



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బండి సంజయ్

**హుస్నాబాద్, మే 13,ప్రభాతవార్త :** రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీకే మెజారిటీ సీట్లు వస్తాయని కరీంనగర్ తాజామాజీ పార్లమెంట్ సభ్యులు, బిజెపి ఎంపి అభ్యర్థి బండి సంజయ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నాయకులు ఓటర్లకు విచ్చలవిడిగా మద్యం, డబ్బులు పంచి పెట్టారని అయినా ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. ఎన్నికల్లో డబ్బు మద్యం పంచకుండా నిరోదించడంలో ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమయిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల కోడ్‌ను ఉల్లంగించి బిజెపి పార్టీ, ప్రధాని మోడీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ అనుకూల వ్యాఖ్యలు చేశారని ముఖ్యమంత్రికి ఎన్నికల కోడ్ లో మినాహాయింపు ఉంటుందా అని ప్రశ్నించారు. నిబందనలు ఉల్లంగించిన సిఎంపై ఎన్నికల కమిషన్ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న అర్చరీ క్రీడాకారిణి



సిరా గుర్తును చూపుతున్న అనన్య

**మెదక్ మున్సిపాలిటీ, మే13 ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికల్లో ఆల్ ఇండియా యూనివర్సిటీ, నేషనల్ అర్చరీ క్రీడాకారిణి అనన్య ఇరుగు తొలిసారిగా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పార్లమెంట్ పోలింగ్ డే సందర్భంగా సోమవారం మెదక్ పట్టణంలోని పెద్దబజార్ 160వ పోలింగ్ కేంద్రంలో రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ ఆనందం మనుమరాలు, ఆల్ ఇండియా యూనివర్సిటీ, నేషనల్ అర్చరీ క్రీడాకారిణి అనన్య ఇరుగు తొలిసారి ఓటువేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్య భారతదేశంలో మొదటి సారిగా ఓటు వేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. దేశ ప్రజలకు ఉత్తమ పరిపాలన అందించే నాయకులకు ఓటు వేయాలన్నారు. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, చాలా విలువైందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సూచించారు. ముఖ్యంగా యువత చేతిలో దేశ భవిష్యతుతన ఉందన్నారు.

### సమస్యాత్మక గ్రామాల్లో ప్రశాంతంగా పోలింగ్

**సిర్గాపూర్, మే 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామంగా పోలీసులు గుర్తించిన కడ్పల్, ఖాజాపూర్ గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ ప్రశాంతంగా పూర్తవడంతో గ్రామస్థులతో పాటు అధికారులు, పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద తహసీల్దార్ ఉమాశంకర్, సిఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ మహిపాల్‌రెడ్డిల పర్యవేక్షణలో పోలింగ్ కొనసాగింది. లక్ష్మణ్‌నాయక్ తండాకు చెందిన గిరిజనులు ఒకే మారుగా పోలింగ్ కేంద్రానికి చేరుకోవడంతో కేంద్రంవద్ద పెద్దఎత్తున బారులు తీరారు.

# పోలింగ్ ప్రశాంతం

- స్వల్పంగా పెరిగిన ఓటింగ్ శాతం
- అత్యధికంగా నర్సాపూర్‌లో 83.15 శాతం
- అత్యల్పంగా పటాన్‌చెరులో 58.94శాతం
- ఓటుహక్కు వినియోగించుకున్న ప్రముఖులు
- ఉదయం నుంచే బారులుతీరిన ఓటర్లు
- అక్కడక్కడా మొరాయించిన ఈవీఎంలు
- మెదక్ పార్లమెంట్‌లో 73.63 శాతం, జహీరాబాద్ పార్లమెంట్‌లో 72.50 శాతం



తమ ఓటు హక్కును వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు

**సంగారెడ్డి బ్యూరో, మే 13 ప్రభాతవార్త:** సార్వత్రిక లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మెదక్, జహీరాబాద్ పార్లమెంట్‌ల పరిధిలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 6 గంటలకు ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోలింగ్ నిర్వహించిన అధికారులు 7 గంటల నుంచి పోలింగ్‌ను ప్రారంభించారు. అక్కడక్కడా ఈవీఎంలు మొరాయించడంతో కొంత ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతిలు పార్లమెంట్‌ల పరిధిలో ఎలాంటి సంఘటనలో చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి వెబ్ క్యాస్టింగ్‌తో పాటు స్వయంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్‌చెరు, గజ్వేల్, దుబ్బాక, సిద్ధిపేట ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. మెదక్ నియోజకవర్గంలో 2,18,735, సిద్ధిపేటలో 2,37,591,దుబ్బాకలో 2,00,125, గజ్వేల్‌లో 2,80,913, సంగారెడ్డిలో 2,49,775, నర్సాపూర్‌లో 2,27,088, పటాన్‌చెరులో 4,13,983 మంది ఓటర్లు ఉండగా మొత్తం పార్లమెంట్ పరిధిలో 18,28,210 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 8,92,656, స్త్రీలు 9,25,891, ఇతరులు 209 మంది ఉన్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో 2,124 పోలింగ్‌స్టేషన్లకుగాను పీవోలు 2,336, ఏపీవోలు 2,336, వోపీవోలు 4,672, మైక్రో అబ్జర్వర్లు 166మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ ఉదయం 9గంటలవరకు 10.99 శాతం, 11 గంటల వరకు 28.30 శాతం, మధ్యాహ్నం 1 గంటల వరకు 46.72 శాతం, 3 గంటల వరకు 60.94, సాయంత్రం 5 గంటల వరకు 71.33 శాతం, పోలింగ్ ముగిసే వరకు ....... శాతం నమోదైంది. 2019 ఎన్నికలతో పోలిస్తే స్వల్పంగా ఓటింగ్ శాతం పెరిగింది. అదేవిధంగా జహీరాబాద్ పార్లమెంట్‌లో 2,75,562, నారాయణఖేడ్‌లో 2,37,241, ఆందోల్‌లో 2,50,857, జుక్కల్‌లో 2,02,769, ఎల్లారెడ్డిలో 2,23,009, బాన్సువాడలో 1,96,691, కామారెడ్డిలో 2,64,626 మంది ఓటర్లు ఉండగా మొత్తం జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో 16,40,755 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 8,01,563, మహిళలు 8,39,133, ఇతరులు 59 మంది ఉన్నారు. మొత్తం జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో 1,973 పోలింగ్ స్టేషన్లు ఉండగా పీవోలు 2,344, ఏపీవోలు 2,344, వోపీవోలు 6,487 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉదయం 7 గటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా ఉయదం 9 గంటల వరకు 12.88శాతం, 11 గంటల వరకు 31.83 శాతం, మధ్యాహ్నం 1 గంటల వరకు 50.71 శాతం, 3 గంటల వరకు 63.96 శాతం, సాయంత్రం 5 గంటల వరకు 71.91 శాతం, పోలింగ్ ముగిసే సమయానికి......... శాతంగా నమోదైంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 69.70 శాతం నమోదు కాగా ఈ ఎన్నికల్లో స్వల్పంగా ఓటింగ్ శాతం పెరిగి........ శాతంగా నమోదైంది. మెదక్ పార్లమెంట్ పరిధిలో అత్యధికంగా నర్సాపూర్‌లో 81.15 శాతం, అత్యల్పంగా పటాన్‌చెరులో 58.94 శాతం పోలింగ్ నమోదైంది.

**ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు..**

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలలో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మెదక్ జిల్లాలో కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ బాలస్వామి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థులు నీలం మధు, వెంకట్రామిరెడ్డి, రఘునందన్‌రావు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, కేసీఆర్, సంజీవరెడ్డి, మాణిక్‌రావు, మంత్రి దామోదర రాజనర్సింహా, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఐఎఎస్ షరత్‌తో పాటు పలువురు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మెదక్, జహీరాబాద్ పార్లమెంట్‌ల పరిధిలో అక్కడక్కడ ఈవీఎంల మొరాయింపులు, చిన్న సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి, సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్‌లు పోలింగ్ ప్రశాతంగా నిర్వహించేందుకు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. పోలింగ్ సమయం ముగిసే వరకు క్యూలైన్‌లలో వేచి ఉన్న వారికి ఓటు వేసే అవకాశాన్ని కల్పించారు. అనంతరం పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలను సీజ్ చేసి గట్టి బందోబస్తు మధ్య ఈవీఎంలను నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలకు తరలించారు.

## బొమ్మారెడ్డిగూడెంలో మొరాయించిన ఈవీఎం

**-పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ క్రాంతి**

**పుల్కల్, మే 13, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. పుల్కల్ మండలంలో 30, చౌటకూరు మండలంలో 24 పోలింగ్ కేంద్రాలలో ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. బొమ్మారెడ్డిగూడెం పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ప్రారంభంలో ఈవీఎం మొరాయించడంతో అర గంట పాటు ఓటింగ్‌కు ఆలస్యమయింది. ఈవీఎంలో తలెత్తిన సమస్యను అధికారులు పరిష్కరించడంతో పోలింగ్ మొదలయింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి జైపాల్ నాయక్ తన స్వగ్రామమైన బొమ్మారెడ్డిగూడెం గిరిజన తండాలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. శివంపేట్‌లోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, జిల్ల కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించారు.



ఓటింగ్ సరళిని వెబ్ క్యాస్టింగ్ ద్వారా పరిశీలిస్తున్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి



జోగిపేటలో ఓటుహక్కు వినియోగించుకున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, కూతురు త్రిష

## రాష్ట్రంలో మెజార్టీ పార్లమెంటు స్థానాలు కాంగ్రెస్ కైవసం

**వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**జోగిపేట, మే 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ పార్లమెంటు స్థానాలను కైవసం చేసుకుంటోందని రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం జోగిపేటలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో పోలింగ్ బూత్ 196లో ఓటుహక్కును వినియోగించుకున్నారు. అనంతరం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ దేశంలోకూడా ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఇండియా కూటమి అత్యధిక స్థానాలు గెలుపొంది అధికారం చేపట్టునున్నట్లు ఆయన తెలిపారు. బిజెపికి రెండు వందల కన్నా ఎక్కువ సీట్లు రావన్నారు. ఇకపోతే రాష్ట్రంలో త్రిముఖ పోటీ లేదని, ప్రజలంతా కాంగ్రెస్ వైపేఉన్నారని, ఈ పరిస్థితుల్లో 12 నుంచి 14 ఎంపి స్థానాలను తాము కైవసం చేసుకోనున్నామని ఆయన అన్నారు. జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి సురేష్ శెట్కార్ భారీ మెజార్టీతో విజయం సాధించనున్నారని, అందులో భాగంగా అందోలు నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ వస్తుందని ఆయన అన్నారు. కాగా మంత్రి దామోదర్‌తోపాటు ఆయన కూతురు త్రిష కూడా ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనవెంబడి సీనియర్ నాయకులు జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మెన్ గూడెం మల్లయ్య, కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, రంగ సురేష్‌గుప్త, ఆకుల చిట్టిబాబు, డాకూరి శివశంకర్, కోరబోయిన నాగరాజు, దుర్గేష్, చందర్, పార్టీ ముఖ్య నాయకులు పట్లోల్ల ప్రవీన్, డాకూరి వెంకటేశం పాల్గొన్నారు.

### శివంపేట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

**-వికలాంగులకు ఓటు వేసేందుకు సౌకర్యాల కల్పన**



శివంపేట్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వల్తూరు క్రాంతి

**చౌటకూరు, మే 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని శివంపేట్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సోమవారం పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని కొనసాగుతున్న పోలింగ్‌ను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించి, ఓటర్లను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు ఇబ్బందులు కల్గకుండా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పోలింగ్ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ఈశ్వర్ రాణి తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని ఆయా ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఓడలన అధికారి ఈశ్వర్ రాణి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

## ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

**సాయంత్రం 5 గంటల వరకు 73.63శాతం ఓటింగ్**
**సాయంత్రం 7 దాటినా కొనసాగిన పోలింగ్**
**ఓటుహక్కు వినియోగించుకున్న మంత్రి పొన్నం**



కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్, మే 13, ప్రభాతవార్త:** హుస్నాబాద్ నియోజకవర్గంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థులుగా 28 మంది అభ్యర్థులు బరిలో నిలవగా సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. సాయంత్రం 6 గంటల వరకు కొనసాగిన పోలింగ్‌లో 6 గంటల లోపు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అధికారులు 304 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిర్వహించిన పోలింగ్ తీరును హుస్నాబాద్ ఎన్నికల అధికారి, ఆర్డీవో రాంమూర్తి పోలింగ్ సరళిని పరిశీలించగా హుస్నాబాద్ ఎసిపి వాసాల సతీష్ పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

ఎన్నికల అధికారి రాం మూర్తి మాట్లాడుతూ సాయంత్రం 7గంటల వరకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ పూర్త యిందని సమయంలోపు కేంద్రంలోకి వచ్చిన ప్రతీ ఒక్కరికి ఓటు వేసే అవకాశం కల్పించామన్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ 11 గంటల వరకు 30.35శాతం నమోదు కాగా మధ్యా హ్నం 1వరకు 48.83,3గంటల వరకు 63.98,5 గంటలవరకు 73.63 శాతం ఓటింగ్ నమోదు కాగా 1లక్ష82వేల375 మంది ఓటర్లు తమ హక్కును వినియోగించుకున్నారని 7 వరకు పోలింగ్ కొనసాగుతున్నట్లు సూచించారు. జరిగిన ఎన్నికల ప్రశాతంగా ముగిసేందుకు సహకరించిన కరీంనగర్, సిద్దిపేట జిల్లా కలెక్టర్లకు విధులు నిర్వహించిన అధికారులు, ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**ఓటు హక్కును వినియోగించుకున్న మంత్రి...**

రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఓటు హక్కును హుస్నాబాద్‌లోని బాలుర జూనియర్ కళాశాలలో వినియోగించుకున్నారు. కుటుంబ సమేతంగా మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ బస్టాండ్ నుండి కరీంనగర్ వెళ్లే ఆర్టీసి బస్సులో పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ చెప్పినట్లుగా భారత పౌరుడిగా తన ఓటు హక్కును వినియోగించుకున్నానని ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలంటే మతతత్వాన్ని,ప్రాంతీయ తత్వాన్ని, కులతత్వానికో ఇతర ప్రలోభాలకు లొంగకుండా ప్రతీ ఒక్కరు తమ హక్కును వినియోగించుకోవాలన్నారు.

# సిద్దిపేట జిల్లాలో పోలింగ్ ప్రశాంతం

**-ఉదయం భారీగా నమోదైన పోలింగ్.. సాయంత్రం 6 గంటల వరకు 77.80 శాతం పోలింగ్ నమోదు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా సోమవారం సిద్దిపేట జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జిల్లాలో 77.80 శాతం పోలింగ్ నమోదైంది. వేసవి కాలం దృష్ట్యా ఓటర్లు ఉదయం పూటనే పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వివిధ గ్రామాల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు బారులు తీరారు. మధ్యాహ్నం సమయంలో పోలింగ్ మందకోడిగా సాగింది. జిల్లాలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 63.66 శాతం పోలింగ్ నమోదైంది. సిద్దిపేటలో 58.63 దుబ్బాకలో 67.17, గజ్వేల్‌లో 65.13, హుహుస్నాబాద్‌లో 63.98 శాతం నమోదైంది.

యువకులు, మహిళలు, పురుషులు, వృద్దులు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లాలో 74.41 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో సాయంత్రం 6 గంటలవరకు 77.80శాతం పోలింగ్ నమోదైంది. సిద్దిపేటలో 73.15 దుబ్బాకలో 81.72, గజ్వేల్‌లో 79.70, హుహుస్నాబాద్‌లో 76.93 శాతం నమోదైంది.

కాగా మాజీ మంత్రి హరీష్‌రావు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా పెద్దఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈ సారి ఆదునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అధికారులు వినియోగించారు. కలెక్టర్, ఎన్నికల అధికారి మిక్కిలినేని మను చౌదరి జిల్లాలోని వివిధ మండలాల్లో పర్యటించి పోలింగ్ తీరును పరిశీలించారు. అలాగే సీపీ డా॥అనురాధ జిల్లాలోని వివిధ మండలాలలో పర్యటించి పోలింగ్ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు.



పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి



పోలింగ్ తీరును పరిశీలిస్తున్న సీపీ డా॥అనురాధ



ఓటు హక్కును వినియోగించుకున్న ఎస్పీ చెన్నూరి రూపేష్

## ప్రశాంతంగా పార్లమెంట్ ఎన్నికలు

**-ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు**

**సంగారెడ్డి బ్యూరో, మే 13 ప్రభాతవార్త:** ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల సరళి సాయంత్రానికి ముగిసే సరికి మెదక్ పార్లమెంట్‌లో నుంచి 71.33 శాతం ఓట్లు, జహీరాబాద్ పార్లమెంట్‌లో 71.91 శాతం ఓట్లు పోలయ్యాయి. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలింగ్‌లో ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ సతీ సమేతంగా సంగారెడ్డిలోని పోలింగ్ కేంద్రంలో 106/39లో ఓటుహక్కును వినియోగించుకున్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సదాశివపేట్‌లోని పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలోని పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలవద్ద ప్రత్యేక పర్యవేక్షణచేపట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ఎన్నికల సరళిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు.

### పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేస్తూ సెల్ఫీ దిగిన యువకుడు

**నర్సాపూర్ మే, 13. ప్రభాతవార్త :** మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మంగలి గణేశ్ పోలింగ్ సిబ్బందికి తెలియకుండా సెల్‌ఫోన్‌తో పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఓటు వేస్తు సెల్ఫీ దృశ్యం చిత్రీకరించాడు. అంతటితో ఆగకుండా తాను ఓటు వేస్తున్న దృశ్యాన్ని పలు వాట్సాఫ్ గ్రూపుల్లో కి ఫార్వర్డ్ చేశాడు.దీంతో నర్సాపూర్ వ్యాప్తంగా ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.పోలింగ్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఆ యువకుడు సెల్‌ఫోన్‌తో వెళ్ళి ఓటు వేస్తున్న దృశ్యాన్ని చిత్రీకరించాడని పలువురు రాజకీయ పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు.ఈ విషయమై నర్సాపూర్ ఎస్ఐ పుష్పరాజ్‌ను వివరణ కోరగా ఎన్నికల కమీషన్ నిభంధనలకు విరుద్ధంగా సెల్‌ఫోన్ ఫొటో నుంచి గ్రూపుల్లో ఫార్వర్డ్ చేసిన మంగలి గణేశ్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు.

## నగదు, మద్యం బాటిళ్లు పట్టివేత

**రాయపోల్, మే 13 ప్రభాతార్త :** ఎన్నికలకోడ్ అమలులో ఉన్నందున ఎస్ఐ రఘుపతి సిబ్బందితో కలిసి వడ్డేపల్లి గ్రామానికి చెందిన గుమ్మడి లింగం ఇంట్లో రైడ్‌చేయగా ఓటర్లకు పంపిణీకి సిద్ధంగాఉన్న 56 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.అలాగే గుమ్మడి సత్తయ్య ఇంట్లో తనిఖీలు నిర్వహించగా 48 మద్యం బాటిళ్ల పట్టుబడగా వాటిని స్వాధీనం చేసుకున్నారు.అలాగే మండల పరిధిలోని చిన్నమాసాన్‌పల్లి గ్రామానికి ఆవుల కొండల్‌రెడ్డి ఇంట్లో తనిఖీలు నిర్వహించగా 37 మద్యం బాటిళ్ల పట్టుబడగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే మండల పరిధిలోని రామారం గ్రామానికి చెందిన రెడ్డబోయిన నరేష్,లకుమల్ల బుదయ్య, పెరుమల్ల స్వామిలు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తుండగా వారి వద్ద నుండి 15210 రూపాయలను స్వాధీనం చేసుకొని వీరందరి పైన కేసు నమోదు చేసినట్లు రాయపోల్ ఎస్ఐ రఘుపతి తెలిపారు

# ఓటు వేశారు



కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్న తెలంగాణ చలనచిత్ర వాణిజ్య మండలి కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కల పాండురంగరావు

## ఓటు హక్కు భారం కాదు.. ఒక బాధ్యత

**గొట్టిముక్కల పాండురంగారావు**

వివేకానందనగర్ కాలనీ, మే 13, ప్రభాతవార్త : రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కు భారం కాదని, అది ఒక బాధ్యత అని ప్రతీ ఒక్కరు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని, మెరుగైన సమాజం కోసం పాటుపడాలని కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్న తెలంగాణ చలనచిత్ర వాణిజ్య మండలి కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కల పాండు రంగరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఓటు వేసినట్లు చూపిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు

**ఓటు వేసిన మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు**

**తార్నాక..** తార్నాకలోని తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్ రావు ఓటు వేశారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకొని దేశ భవిష్యత్తుకు పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. తమ ఓటు హక్కును యువత వినియోగించుకొని స్ఫూర్తిదాయకంగా నిలువాలని సూచించారు.



ఓటు వేసినట్లు చూపిస్తున్న మాజీ నగర మేయర్ బండ కార్తికచంద్రారెడ్డి దంపతులు

**ఓటు వేసిన మాజీ మేయర్ కార్తీకరెడ్డి**

ఓటు వజ్రాయుధం లాంటిదని మాజీ మేయర్ బండ కార్తిక రెడ్డి పేర్కొన్నారు. తార్నాక నాగార్జుననగర్ కమ్యూనిటీ హాల్లో నగర మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు బండకార్తిక చంద్రారెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి ఒక్కరు ఓటు వేసి దేశ భవిష్యత్‌కు పాటుపడాలని కోరారు.



ఓటు వేసినట్లు చూపిస్తున్న ఒయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ దంపతులు

**ఓటు వేసిన ఓ.యూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ**

ఓటు అనేది ప్రతి ఒక్కరి భాధ్యత అని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ పేర్కొన్నారు. ఓ.యూ దూర విద్యాకేంద్రం సెంటర్‌లో ఆయన సతీమణితో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకు న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు వేసి తమ భాధ్యతను నెరవేర్చుకోవాలని సూచించారు. చదువుకునే యువత ఓటు వేసి ఓటింగ్ శాతాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

## పాతబస్తీలో ప్రశాంతంగా పోలింగ్

చార్మినార్,మే 13 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీలో ప్రశాతంగా ఎన్నికల పోలింగ్ జరిగింది.ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు.చార్మినార్, మలక్‌పేట్,చాంద్రాయణగుట్ట,బహదూర్‌పుర,కార్వాన్,గోషా మహల్,యాకుత్‌పుర అసెంబ్లీ నియోజకవర్గాలలో సోమవారం పోలింగ్ మంద కోడిగా జరిగింది.మధ్యాహ్నం తర్వాత ప్రజలు ఓటు వేయటానికి తరలి వచ్చారు. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవ ర్గంలో 44.84 శాతం పోలింగ్ నమోదైంది.కాగా సోమవారం సాయంత్రం ఐదు గంటలు వరకు మాత్రం 39.17 శాతం పోలింగ్ నమోదైంది. సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా హైదరాబాద్ పాతబస్తీ దక్షిణ మండలంలో 1500 మంది పోలీస్ అధికారులు, పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.

**పాతబస్తీ బీబీబజార్ చౌరస్తాలో స్వల్ప ఉద్రిక్తత**

హైదరాబాద్ పాతబస్తీ మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థి మాధవి లత,యాకుత్‌పుర నియోజకవర్గం ఎంఐఎం యూత్ ఇంఛార్జి యాసర్ అరాఫత్‌లు ఎదురెదురు కావటంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది.బీబీ బజార్‌లోని ఓ పోలింగ్ కేంద్రాన్ని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఓవైసీ పరిశీలించిన అనంతరం మొగల్‌పుర వెళ్లారు.అదే సమయంలో భవానీనగర్ నుంచి హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థి మాధవి లత మొగల్‌పుర వైపు వెళ్తున్నారు.కాగా యాకుత్‌పుర నియోజక వర్గం ఎంఐఎం యూత్ ఇంఛార్జి యాసర్ అరాఫత్, మాధవి లత బీబీబజర్ చౌరస్తా వద్ద ఎదురు పడ్డారు.



గోల్నాకలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ తన కుటుంబ సభ్యులతో ఓటు హక్కు వినియోగించుకున్న దృశ్యం



రెడ్డి కాలేజీలోని బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న జిహెచ్‌ఎంసి మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు



ఓటు హక్కును వినియోగించుకున్న మేయర్ కోలన్ నీలాగోపాల్‌రెడ్డి, కోలన్ గోపాల్‌రెడ్డి



నల్లకుంటలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న పిసిసి కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్, ఎ.జ్యోతియాదగిరిగౌడ్‌లు



అంబర్ పేటలో ఓటు హక్కు వినియోగించుకున్న బిఆర్ఎస్ అంబర్‌పేట ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి

**హైదరాబాద్..** అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం గోల్నాక డివిజన్ తులసినగర్‌కాలనీలోని సెయింట్ పాల్ స్కూల్‌లో వారు ఓటు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని పిసిసి కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్, నల్లకుంట డివిజన్ కంటెస్టెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఎ.జ్యోతి యాదగిరిగౌడ్‌లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం నల్లకుంటలో ఓటు వినియోగించుకొని మాట్లాడారు. అనం తరం వారు పలు ప్రాంతా ల్లో పర్యటించి ఓటింగ్ సరళిని సమీక్షించారు. జిహె చ్ఎంసి మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు ఓటు హక్కు వినియోగిం చుకున్నారు. సోమవారం కాచిగూడ డివిజన్, రెడ్డి కాలేజీలో ఆయన ఓటు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ ఓటు హక్కును వినియోగించు కున్నారు. బిఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**ఓటు హక్కును వినియోగించుకున్న మేయర్ దంపతులు**

**నిజాంపేట్..** పోలింగ్ కేంద్రానికి మేయర్ కోలన్ నీలా గోపాల్‌రెడ్డి దంపతులు వెళ్లి ఓటు వేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడు తూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, అది మన అందరి బాధ్యత అని, ఆలస్యం చేయకుండా ప్రతీ ఒక్కరూ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయాలని, అదేవిధంగా ఓటుహక్కు ఉన్న వేరేవాళ్లతో కూడా ఓటు వేయించాలని తెలిపారు.

**ఓటు హక్కును వినియోగించుకున్న కార్మిక నాయకులు చింతల నాగరాజు**

**జీడిమెట్ల..** పార్లమెంట్ ఎన్నికలు సందర్భంగా రాష్ట్ర కార్మిక నాయకులు చింతల నాగరాజు చింతల్లోని అక్షర స్కూల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని పారిశ్రామిక వాడలో కంపెనీలన్నీ సెలవులు కూడా ప్రకటించడం జరిగిందని, కార్మికులు అందరూ, కుత్బు ల్లాపూర్ ప్రజలు అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలకు మంచి చేసే నాయకున్ని ఓటు అనే ఆయుధం ద్వారా ఎంచుకోవాలని నాగరాజు విజ్ఞప్తి చేశారు.

**అందరూ ఓటు వేసి ప్రజాస్వామ్యంలో భాగం కావాలి : జోత్స్న శివారెడ్డి**

**కొంపల్లి..** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లి మున్సిపల్ పరిధిలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్యోత్స్న శివారెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఆమె ఓటు వేశారు. ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని దానిని ప్రతి ఒక్కరూ వినియోగించుకొని ప్రజాస్వామ్యంలో భాగం కావాలని ఆమె కోరారు.

**అల్వాల్‌లో ఓటు వేసిన ప్రముఖులు**

**అల్వాల్..** అల్వాల్ ప్రాంతంలో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మైనంపల్లి హనుమంతరావు కుటుంబ సమేతంగా ఓటు వేశారు. అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి భర్త చింతల శ్రీనివాస్ రెడ్డితో కలిసి అల్వాల్ గౌతమ్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. వెంకటాపురం కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్ వెంకటాపురంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ఉదయం మందకొడిగా ప్రారంభమైనా పది గంటలు తరువాత నుంచి ఓటర్లు కేంద్రాలు వద్ద బారులు తీరారు. ఒంటి గంట వరకు ఓటర్లుతో పోలింగ్ కేంద్రాలు వద్ద రద్దీ కనిపించింది. మధ్యాహ్నం రెండు గంటలు తరువాత పోలింగ్ కేంద్రాలు వెలవెల బోయాయి. కాలనీ వాసులు పెద్దగా పోలింగ్ పట్ల ఆసక్తి కనపరచలేదు.

**ఓటు హక్కును వినియోగించుకున్న వేలాది మంది ఓటర్లు**

**సైఫాబాద్..** లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా సికింద్రాబాద్ నియోజకవర్గంలో సోమవారం బషీర్‌బాగ్, సైఫాబాద్, లిబర్టి, హైదర్‌గూడ, హిమాయత్ నగర్ తదితర ప్రాంతాల్లోని వేలాది మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసుల బందోబస్తుల నడుమ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం కాస్తంత మందకోడిగా పోలింగ్ ప్రారంభమైనప్పటికి మధ్యాహ్నం వరకు పోలింగ్ పుంజుకుంది. మిట్ట మధ్యాహ్నం ఎండ తీవ్రంగా ఉండటంతో సాయంత్రం పోలింగ్ పలచగా కొనసాగింది. సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు పోలింగ్ బాగా జరిగింది. ఒక వైపు ఎన్నికల సిబ్బంది ఓట్లు తనిఖీతో విధులు నిర్వహించడం, మరొక వైపు పోలీసులు గట్టిగా బందోబస్తుతో చేపట్టడంతో పోలింగ్‌కు ఏలాంటి అటంకం లేకుండా కొనసాగింది. పోలింగ్‌లో యువత మొదలుకొని పురుషులు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు పాల్గొన్నారు. యువతీయువకులు చాలా ఉత్సహంతో ఓటింగ్‌లో పాల్గొన్నారు.



నాంపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న నాంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్. ఆనంద్‌కుమార్‌గౌడ్




ఓటుహక్కును వినియోగించుకుని చూపిస్తున్న బిజెపి గన్ ఫౌండ్రి డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాష్ బిస్వా



ఓటుహక్కును వినియోగించుకుని చూపిస్తున్న భజరంగ్‌సేనా ప్రతినిధులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త




గౌలిగూడలో ఓటుహక్కును వినియోగించుకుని చూపిస్తున్న కార్పొరేటర్ జి.శంకర్‌యాదవ్ కుటుంబ సభ్యులు



సతీమణితో కలిసి ఓటు వేసిన మైనంపల్లి



కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి



బాలంరాయిలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్న కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్



సెయింట్ పీటర్ స్కూల్‌లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్న మేడ్చెల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి



సిరా వేలిని చూపుతున్న కేశబోయిన శ్రీధర్

## భారీ పోలీసు బందోబస్తు

**బేగంబజార్..** గోషామహల్ నియోజకవర్గంలో ఎన్నికలు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా జరిగింది.సోమవారం గోషామహల్ నియోజకవర్గంలోని బిజెపి,బిఆర్ ఎస్,మజ్లీస్ పార్టీలతోపాటు స్వతంత్రఅభ్యర్థికి చెందిన నాయకులు,కార్యకర్తలను తమ ఏజెంట్లను నియమించుకున్నారు.కాంగ్రెస్‌కు ఏజెంట్లు నియమించుకోలేదని తెలిసింది.బిజెపి, బిఆర్ఎస్,మజ్లీస్ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద భారీపోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.ప్రజలు కూడా ఉదయంనుంచే తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్‌బూత్‌ల వద్దకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.పోలింగ్ బూత్‌లకు రెండువందలమీటర్ల దూరంగా ఆయాపార్టీలకు చెందిన టేబుల్‌లను వేసుకుని ఓటర్‌స్లీప్‌లు రాని వారికి స్లీప్‌లను ఇవ్వడం కనిపించింది.నియోజకవర్గంలోని బేగంబజార్,దూల్‌పేట్, గోషామహల్, సుల్తాన్‌బజార్,దత్తాత్రేయనగర్, గన్‌ఫౌండ్రి, జాంబాగ్ డివిజన్‌లలోనివివిధ పార్టీలకు చెందిన నాయకులు తమ పార్టీలకు ఓట్లు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేయడం కనిపించింది.



కుటుంబసమేతంగా ఓటువాక్కును వినియోగించుకుని చూపిస్తున్న బిఆర్ఎస్ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి గడ్డంశ్రీనివాస్‌యాదవ్

## ఓట్లు గల్లంతైన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



షేక్‌పేటలో ఓట్లు గల్లంతైన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

యూసుఫ్‌గూడ, మే 13, ప్రభాతవార్త : సికింద్రాబాద్ పార్లమెంటరీ ఎన్నికల్లో భాగంగా సోమవారం జూబ్లిహిల్స్ నియోజకవర్గం ప్రాంతంలోని షేక్‌పేట్‌లో తమ ఓట్లు గల్లంతు కావడంతో స్థానికంగా ప్రజలు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి హుటాహుటీన ఆప్రాంతానికి చేరుకుని ఓటర్ లిస్టలను పరిశీలించారు. షేక్‌పేట్‌లోని బూత్ నెంబర్ 15లో కొత్త ఓటరు జాబితాలో 3వేల ఓట్లు గల్లంతు అయ్యాయని గుర్తించినట్లు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనే వారంతా ఓట్లు వేశారని అయితే ఇప్పుడేమో ఓటరు లిష్టులో అవన్ని డిలిట్ అయ్యాయని చెబుతున్నారన్నారు. బీజేపికి వ్యతిరేకంగా అధికారులు ఓట్లను తొలగించినట్లు తెలుస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో కేవలం ఒక వర్గానికి చెందిన వారి ఓట్లను మాత్రమే డిలిట్ చేసినట్లు అర్థమవుతుం దన్నారు. వారం కిందటే ఇక్కడ తమ కార్యకర్తలు ఓటరు స్లిప్‌లను పంచారని ఇపుడు లిష్టులో ఓటరు పేరుతో ఎలా డిలిట్ అయ్యాయని ప్రశ్నించారు. సంబందిత అధికారులు కావాలనే ఓటరు లిష్టులో ఓట్లను డిలిట్ చేశారని దీనిపై పోరాడతామన్నారు. ఈవిషయమై ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యా దు చేశామని దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామని హామీ ఇచ్చామన్నారు. అంతేకాకుండా రాష్ట్ర కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేయబోతున్నామన్నారు. అనంతం బీజేపి సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షురాలు జూటూరి కీర్తిరెడ్డి మాట్లాడుతూ షేక్‌పేట ప్రాంతంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు వేసిన వారిని పార్లమెంటు ఎన్నికలు వచ్చే సరికి ఓట్లు ఎలా తొలగించబడుతాయని ప్రశ్నించారు.వారంతా బీజేపి ఓటర్లనే కావాలని స్థానిక ఎమ్ఐఎమ్, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు కక్ష కట్టి ఓట్లు తొలగించారని మండిపడ్డారు.



నవోదయ కాలనీలో ఓటును వినియోగించుకున్న జూబ్లిహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్



బోరబండలో ఓటువాక్కును వినియోగించుకున్న గ్రేటర్ హైదరాబాద్ మాజీ ఉపమేయర్ బాబాఫసియుద్దీన్



ఓటువాక్కును వినియోగించుకున్న అల్లాపూర్ కార్పోరేటర్ సబీహా గౌసుద్దీన్ దంపతులు



ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ జూబ్లిహిల్స్ శాసన సభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి దంపతులు



:ఓటు హక్కును వినియోగించుకున్న వెంగళరావునగర్ కార్పోరేటర్ దేదిప్యవిజయ్‌కుమార్



ఓటువాక్కును వినియోగించుకున్న జూబ్లిహిల్స్ నియోజకర్గం బీజేపి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే లంకల దీపక్‌రెడ్డి

## కూకట్‌పల్లిలో ఓటు వాక్కు వినియోగించుకున్న ప్రముఖులు






ఓటు వినియోగించుకున్న అనంతరం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కుటుంబ సభ్యులు, వివేకానందనగర్ డివిజన్ కార్పోరేటర్ మాధవరం రోజాదేవి, మాజీ కార్పోరేటర్ రంగారావు, ఎమ్మెల్సీ కురుమయ్యగారి నవీన్‌కుమార్



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

కెపిహెచ్‌బి కాలనీ, మే 13, ప్రభాత వార్త : పార్లమెంట్ ఎన్నిక లను పురస్కరించుకుని కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజ కవర్గాల పరిధిలోని ప్రముఖులు నాయకులు సోమవారం ఓటు హక్కును వినియోగించుకున్నారు. కూకట్‌పల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎమ్మెల్సీ కురుమయ్య గారి నవీన్‌కుమార్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కూకట్‌పల్లి లోని శేషాద్రినగర్ కమ్యూనిటీ హాల్లో పోలింగ్ స్టేషన్ 12లో ఓటు హక్కును ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానందనగర్ వివి నగర్ అపార్ట్‌మెంట్ పోలింగ్ బూతులు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు తన ఓటు హక్కును వినియోగించుకు న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ దేశం కోసం భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియో గించుకోవా లని సూచించారు. వివేకా నందన గర్‌లోని సొసైటీ ఆఫీస్‌లో శేరిలిం గంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆయన సతీమణి శ్యామలా దేవి, కొడుకు పృథ్వి, కోడలు భార్గవి, వివేకానందనగర్ డివిజన్ కార్పోరేటర్ మాధవరం రోజాదేవి, మాజీ కార్పోరే టర్ రంగా రావులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే బీఆర్ఎస్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, నాయిని చంద్రకాంతరావు, కార్తిక్ రావు, రామచందర్, జగదీష్, జనంపల్లి పురంధర్‌రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఏజెంట్లు కరువు

చార్మినార్, మే 13 ప్రభాతవార్త : హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ కేంద్రాలలో కాంగ్రెస్ పార్టీ తరుపున పోలింగ్ కేంద్రాలలో ఏజెంట్లు లేరు.ఎంఐఎం,బిజెపిలకు చెందిన ఏజెంట్లు పోలింగ్ కేంద్రాలలో ఉన్నారు.కాగా హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న 1944 పోలింగ్ కేంద్రాలలో అంతంత మాత్రంగానే బిఆర్ఎస్ పార్టీకి పార్టీ తరుపున పోలింగ్ కేంద్రాలలో ఏజెంట్లు ఉన్నారు.కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ వలీ ఉల్లా సమీర్ కాంగ్రెస్ పార్టీ తరుపున హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బరిలో ఉన్నారు. ఆఖరి క్షణంలో వలీ ఉల్లా సమీర్‌కు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ లభించింది.

హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి వలీ ఉల్లా సమీర్ కాంగ్రెస్ పార్టీ తరుపున తక్కువ సమయంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.కాగా సోమవారం జరిగిన ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలలో పాతబస్తీలో ఎక్కడ కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లు కనిపించ లేదు.



చేర్యాల పెద్దమ్మగడ్డ పాఠశాలలో బారులు తీరిన ఓటర్లు

### ప్రశాంతంగా పోలింగ్...ఊపిరి పీల్చుకున్న అధికారులు

**చేర్యాల, మే 13, (ప్రభాతవార్త) :** సిద్దిపేట జిల్లా, జనగామ నియోజకవర్గం, భువనగిరిపరిధిలోని చేర్యాల,మద్దూరు,కొమురవెల్లి,దూళ్మిట్ట మండలాల్లో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.సోమవారం నాలుగు మండలాల పట్టణాలతో పాటు అన్ని గ్రామాల్లోని ప్రజలు ఉదయం 7గంటల నుండే పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు బారులు తీరగా చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని 32వ బూత్‌లో పోలింగ్ 7గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా ఈవీఎంలో టెక్నికల్ ఇష్యూ కారణంగా గంటపాటు ఆలస్యంగా పోలింగ్ మొదలయ్యింది.అలాగే ముస్త్యాల గ్రామంలోని 71వ పోలింగ్ బూత్‌లో కొంత సేపు ఈవీఎం మొరాయించడంతో అధికారులు వెంటనే సరిచేశారు.

**బిఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర ఉద్రిక్తత...**

చేర్యాల పట్టణంలోని పలు పోలింగ్ బూత్‌ల వద్ద బీఆర్ఎస్,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలమధ్య తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది.పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చిన్న కుమారుడు రాకేష్‌రెడ్డి పోలింగ్ కేంద్రం ఆవరణలో కుర్చిలో కూర్చుని ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నాడని బీఆర్ఎస్ నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య,సిపియం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి,ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా కార్యదర్శి అందె బీరయ్య అక్కడి అధికారులను నిలదీశారు.అధికార పార్టీ నాయకులకు అధికారులు కొమ్ముకాస్తున్నారని ధ్వజమెత్తారు.కొమ్మూరి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ మానాన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఓటు వేయడానికి ఇక్కడి సెంటర్‌కు వస్తున్నాడని తనతో పాటు నేనుకూడా వేటు వేయడానికే కొద్దిసేపు కుర్చిలో కూర్చున్నానే తప్పా ఎవరిని ప్రలోభాలకు గురి చేయలేదని తెలిపారు.అనంతరం ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతాప్‌రెడ్డి కుమారుడితో కలిసి పెద్దమ్మగడ్డ బాయస్ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించడానికి వెళ్ళడంతో తనతో ఎంత మంది పోలింగ్ సెంటర్లకు ప్రవేశిస్తారని బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళనకు దిగడంతో అక్కడే ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు జోక్యం చేసుకోవడంతో ఇరువర్గాల మధ్య కొంత సేపు ఘర్షణ వాతవరణం నెలకొంది.మళ్ళీ అక్కడి నుండి గర్ల్స్ హైస్కూల్‌కు వెళ్ళిన బీఆర్ఎస్,కాంగ్రెస్ కార్యకర్తలు అక్కడ ఒకరిపై ఒకరు గళ్ళలు పట్టుకుని తోపులాడుకున్నారు.వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని అందరిని చెల్లచెదురు చేసి అక్కడి నుండి పంపించేశారు.మద్దూరు మండలం బైరన్‌పల్లి పోలింగ్ బూత్‌లో కూడా బీఆర్ఎస్,బీజేపి,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మధ్య కూడా ఘర్షన చోటుచేసుకుంది.

**పెద్దశంకరంపేట మండలంలో...**



ఓటు హక్కును వినియోగించుకున్న వృద్ధురాలు

**పెద్దశంకరంపేట, మే 13 ప్రభాతవార్త:** మండలంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పెద్దశంకరంపేటతో పాటు ఆయా గ్రామాల్లో ఉదయం నుండి పోలింగ్ బూత్‌ల వద్ద జనాలు బారులు తీరారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సరేష్ షెట్కార్ నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిలు పెద్దశంకరంపేటతో పాటు పలు గ్రామాల్లో పర్యటించి పోలింగ్ సరళిని పరిశీలించడంతోపాటు ఆయా పార్టీల నాయకులను అడిగి ఓటింగ్ తీరును తెలుసుకున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వికలాంగులకు, వృద్ధులకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. పెద్దశంకరంపేటతో పాటు అన్ని గ్రామాల్లో వృద్ధులు, యువకులు, మహిళలు, ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### అల్లాదుర్గం మండలంలో 74.82 శాతం పోలింగ్

**అల్లాదుర్గం, మే 13, ప్రభాతవార్త:** జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికలకుగాను సోమవారం జరిగిన ఓటింగ్ మండలంలో ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని ఆయా గ్రామాల్లో 74.82 శాతం ఓటింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభం అయిన పోలింగ్ ఉదయం 9 గంటల వరకు 16శాతం, ఒంట గంట వరకు 52శాతం, మధ్యాహనం 3 గంటల వరకు 62 శాతం, సాయంత్రం 5 గంటల రకు 70శాతం, 6 గంటల వరకు 74.82 వాతం ఓటింగ్ జరిగింది. మండలంలో ఎన్నికల ప్రశాంతంగా ముగిసేలా సిఐ రేణుక రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తన పోలీసులు సిబ్బందితో బందోబస్తును నిర్వహించారు. బస్తును నిర్వహించారు.

### ఓటు హక్కు వినియోగించుకున్న కాట దంపతులు



ఓటు వేసిన తరువాత సిరా గుర్తును చూపుతున్న కాట దంపతులు

**అమీన్‌పూర్, మే 13 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, వారి సతీమణి సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్‌గౌడ్‌లు సోమవారం పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికల వ్యవస్థ అద్భుతమైనదని తెలిపారు. ఓటు మన హక్కు అని, ఓటు వేయడం మన బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు.

### అమెరికా నుంచి వచ్చి ఓటు వేసిన యువతులు

**మెదక్ మున్సిపాలిటీ, మే 13 ప్రభాతవార్త:** లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఇద్దరు యువతులు అమెరికా నుంచి రావడం విశేషం. మెదక్ పట్టణానికి చెందిన మెంగని యామిని ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వినియోగించుకోవడానికి ఆమె తిరిగి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే డిగ్రీ పూర్తి చేసిన అనన్య మొదటిసారిగా ఓటు వేయడం ఎంతో అనుభూతిని ఇచ్చిందని చెప్పారు. ఓటు హక్కు మన దేశ భవిష్యత్తును రూపొందించడంలో ప్రజాస్వామ్యం కల్పించిన బాధ్యతగా పేర్కొన్నారు.



ఫోటో3: అమెరికా నుండి వచ్చి ఓటు వేసిన యువతి

# ప్రశాంతంగా ముగిసిన పార్లమెంట్ ఎన్నికలు



కొత్తపల్లిలో ఓటుహక్కు వినియోగించుకున్న గ్రామస్తులు



కోర్పొల్లిలో... ఎమ్మెల్యే రోహిత్‌రావు దంపతులు



చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న ఎస్పీ బాలస్వామి



చిన్నశంకరంపేటలో... వీల్‌చైర్‌లో వస్తున్న వృద్ధురాలు



నర్సాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



నర్సాపూర్‌లో పోలింగ్ సరళిని పరిశీలించిన నీలం మధు



నర్సాపూర్‌లో పోలింగ్ సరళిని పరిశీలించిన వెంకట్రామ్‌రెడ్డి



మాడ్గిలో ఓటు హక్కును వినియోగించుకున్న గాలి అనిల్‌కుమార్ దంపతులు



అమియా తండాలో బారులు తీరిన గిరిజనులు



ఓటు హక్కును వినియోగించుకుంటున్న మాజీ ప్రొటెం స్పీకర్ భూపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు



కామారెడ్డి జిల్లా సిర్పూర్‌లో ఓటు వేసిన బిజెపి ఎంపీ అభ్యర్థి బిబి పాటిల్ దంపతులు



మెటల్‌కుంటలో... మాజీ మంత్రి చంద్రశేఖర్



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు



పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎస్పీ బాలస్వామి



వెల్దుర్తిలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



న్యాల్‌కల్‌లో ఓట్లు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

**రాయపోల్ మే 13 ప్రభాతవార్త :** మండల వ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. వివిధ గ్రామాల్లో ఉదయం నుండే పోలింగ్ కేంద్రాల వద్దకు ఓటర్లు చేరుకొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు ముగిసింది.మండలంలో మొత్తం 21637 మంది ఓటర్లు ఉండగా 84.97 శాతం పోలింగ్ నమోదు అయినట్లు రాయపోల్ తహసీల్దార్ దివ్య తెలిపారు.

**చిన్నశంకరంపేట మండలంలో...**

**చిన్నశంకరంపేట, మే 13,ప్రభాతవార్త:** లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మండల వ్యాప్తంగా ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. ప్రజలు సోమవారం ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా అధికారులు, పోలింగ్‌కేంద్రాలను జిల్లా ఎస్పీ బాలస్వామి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 770 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఎక్కడా కూడ అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తిన సమాచారం ఇవ్వాలని అధికారులకు సూచించామన్నారు. అలాగే తన స్వగ్రామమైన కొరివిపల్లిలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మిరెడ్డి జంగరాయిలో, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎకే గంగాధర్‌రావు గవ్వలపల్లిలో, మాజీ ఎంఎసీ చైర్మన్ గంగానరేందర్ గవ్వలపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**నర్సాపూర్ నియోజకవర్గంలో...**

**నర్సాపూర్ మే, 13. ప్రభాతవార్త :** నర్సాపూర్ నియోజక వర్గంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు వేయడానికి క్యూలో నిల్చున్నారు. నర్సాపూర్‌లో మధ్యాహ్నం వరకు సుమారు 55శాతం, సాయంత్రం 4గంటలవరకు 70.12 శాతం, సాయంత్రం 6 గంటలవరకు 81.15 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాగా మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఒక వ్యక్తి ఓటు వేస్తూ సెల్ఫీ దిగిన సంఘటన మినహా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా సాగాయి. పోలింగ్ సరళిని పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతోపాటు ఐజి రంగనాథ్ పరిశీలించారు.

**నర్సాపూర్‌లో పోలింగ్ సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే ...**

నర్సాపూర్‌లోని జూనియర్ కళాశాలలో ఎన్నికల పోలింగ్ సరళిని ఎమ్మెల్యే సునీతారెడ్డి పరిశీంచారు. అలాగే మెదక్ పార్లమెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా 286 బూత్‌లో ఈవిఎం మిషన్ మొరాయించడం తెలుసుకొని పోలింగ్ సిబ్బందితో మాట్లాడి ఈవిఎం మిషన్‌ను సరిచేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువ నాయకులు శశిధర్‌రెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, ఎన్నికల ఇంచార్జి సింగాయిపల్లి గోపి, బిఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, పంబళ్ళ బిక్షపతి, బాల్‌రెడ్డి, కౌన్సిలర్ రాంచందర్, ఆంజనేయులుగౌడ్, శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

**జహీరాబాద్ నియోజకవర్గంలో...**

**జహీరాబాద్, మే 13, ప్రభాతవార్త:** జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికలు సోమవారం నియోజకవర్గంలోని ఆయా మండాల్లోని గ్రామాల్లో ప్రశాంతంగా ముగిసాయి. పోలింగ్ ముగిసే సమాయానికి 70 శాతంకు పైగా ఓటింగ్ జరిగినటుల అధికారులు తెలిపారు.

**ఓటు వేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు...**

పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలం మాడ్గి గ్రామంలో బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులతో, కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోఇ సిర్పూర్ గ్రామంలో బిజెపి ఎంపి అభ్యర్థి బిబి పాటిల్, మండల కేంద్రమైన ఝరాసంగంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఎఫ్‌డిసి చైర్మన్, పార్లమెంట్ కాంగ్రెస్ నాయకులు ఎన్ గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ ఝరాసంగం మండలంలోని ఈదుపల్లి గ్రామంలో, మాజీ ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ వై నరోత్తం పస్తాపూర్‌లో, పట్టణంలోని మార్కెట్ కేంద్రంలో టిఎస్ ఐడిసి చైర్మన్ మహ్మద్ తన్వీర్‌లు తమ కుటుంబసభ్యులతో ఓటుహక్కును వినియోగించుకున్నారు.

**న్యాల్‌కల్ మండలంలో...**

**న్యాల్‌కల్, మే 13, ప్రభాతవార్త:** మండలంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఆయా గ్రామాల్లో సాయంత్రం 5 గంటల వరకు 72.50 వాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. న్యాల్‌కల్‌లో బిజెపి ఎంపి అభ్యర్థి బిబి పాటిల్, మండలంలోని మెటల్‌కుంట గ్రామంలో మాజీ మంత్రి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్‌లు పోలింగ్ కేంద్రాలను, పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా తహసీల్దార్ భూపాల్ పర్యవేక్షణలో పోలీసు అధికారులు, అధికారులు తగు చర్యలు తీసుకున్నారు.

**రామచంద్రాపురం మండలంలో...**

**రామచంద్రాపురం, మే 13 ప్రభాతార్త :** మండలంలోని ఆయా డివిజన్‌లలో, గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో సోమవారం పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెదక్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి వెంకట్‌రాంరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. రామచంద్రాపురం పట్టణంలోని ఐటిఐ కళాశాలలో మాజీ ప్రొటెం స్పీకర్ వి భూపాల్‌రెడ్డి, భారతీ నగర్ కార్పోరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డిలు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. రామచంద్రాపురం డివిజన్ కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ దంతపులు పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ సర్పంచ్ రజేశ్వర్‌రెడ్డి, నాయకులు జైపాల్, రిటైర్డ్ ఎంఈఓ వెంకటేశ్వర్లు, జగన్నాథ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదతరులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

**పాపన్నపేట మండలంలో 80.63శాతం ఓటింగ్**

**పాపన్నపేట, మే 13, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 80.63 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మండలపరిధిలో 59 పోలింగ్ కేంద్రాలు ఉండగా 41వేల 857 మంది ప్రజలు ఓటు హక్కును పొంది ఉన్నారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో 33వేల 752 మంది ఓటర్లు ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, యూసూఫ్‌పేటలో మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మల్లంపేటలో ఎంపిపి అధ్యక్షురాలు చందన ప్రశాంత్‌రెడ్డి, ఆర్కెలలో జడ్పీటిసి సభ్యురాలు షర్మిల శ్రీనివాస్‌రెడ్డిలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

**ఉమ్మడి వెల్దుర్తి మండలంలో...**

**వెల్దుర్తి, మే 13 ప్రభాతవార్త:** ఉమ్మడి వెల్దుర్తి మండలంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం నుండే ఓటర్లకు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వెల్దుర్తిలోని పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ బాలస్వామి సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. జిల్లాలో 770 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో 530 కేంద్రాలు, 1600 మది పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని జిల్లా ఎస్పీ బాలస్వామి తెలిపారు. 45 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారన్నారు. అలాగే టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి పోలింగ్ సరళిని బీఆర్ఎస్ నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఘటనలు జరగకుండా స్థానిక ఎస్ఐ నవతాగౌడ్ కట్టుదిట్టమైన బందోబస్తు చర్యలు చేపట్టారు. ప్రజలు తమ ఓటు హక్కును సాయంత్రం 6 గంటల వరకు ప్రశాంతంగా వినియోగించుకున్నారు.

**కొల్చారం మండలంలో...**

**కొల్చారం, మే 13 ప్రభాతవార్త:** మండల వ్యాప్తంగా 21 గ్రామపంచాయతీల్లో 33 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని రంగంపేట డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, ఎంపీటీసీ మాధవి రాజాగౌడ్, ఎనగండ్లలో ఎంపీపీ మంజుల కాశీనాథ్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గౌరీశంకర్, సంగాయిపేటలో వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, మాజీ జెడ్పీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, వరిగుంతంలో జెడ్పీటీసీ మేఘమాల సంతోష్, పైతరలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సోమన్న గారి రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ యూత్ ఐకాన్ రవి తేజారెడ్డి, కిష్టాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేశంగౌడ్, మాజీ సర్పంచి తిరుణగారి గోదావరి వెంకట రాములు,రాంపూర్ ఎంపీటీసీ సామల మమత యాదగిరి, చిన్నఘనపూర్‌లో సీడీసీ మాజీ చైర్మన్ సూరెగారి నరేందర్‌రెడ్డి, ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పైతర గ్రామంలో 1349 మంది ఓటర్లకు ఒకే పోలింగ్ బూత్ కావడంతో గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి ఓటర్లు చాలా ఇబ్బందులకు గురయ్యారు. పోలింగ్ కేంద్రాల వద్ద కొల్చారం ఎస్ఐ మహమ్మద్‌గౌస్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

**ఝరాసంగం మండలంలో...**

**ఝరాసంగం, మే 13, ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండల కేంద్రమైన ఝరాసంగంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హన్మంతరావు పాటిల్, మాజీ జిల్ల పరిషత్ చైర్మన్ సునితా హన్మంతరావు పాటిల్, బిజెపి నాయకులు సంతోష్ పాటిల్‌లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

**ములుగు మండలంలో...**

**ములుగు, మే 13, ప్రభాతవార్త:** మండలంలో మెదక్ పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 గంటల నుంచి మండలంలోని 35 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రశాంతమైన వాతావరణంలో ప్రారంభమైంది. ములుగులోని 137 కేంద్రంలో ఈవిఎం కొద్ది సేపు మొరయించడంతో అధికారులు సరి చేసి తిరిగి పోలింగ్ ప్రారంభించారు. మొత్తం మీద మండలంలో ఓ వైపు అధికారం కోల్పోయిన బిఆర్ఎస్, అధికారంలోకి వచ్చిన వచ్చిన కాంగ్రెస్ పార్టీల నేతలతో రాజకీయ సమీకరణాలు గతానికి నేటీకి పూర్తిగా భిన్నంగామారాయని చెప్పుకోవచ్చు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలోపెట్టుకొని తమశక్తిని మంచి శ్రమించారు. బిఆర్ఎస్ నాయకులు జోరుగానే ప్రచారం సాగించారు.

**కొమురవెల్లి మండలంలో...**

కొమురవెల్లి మండలంలో పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో మొత్తం 15322 ఓట్లకు గానూ 11516 ఓట్లు పోలైనాయి. మండలంలో 77.11 శాతం పోలింగ్ నమోదైంది.

**కోహెడ మండలంలో...**

మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో పార్లమెంటు ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. 27 గ్రామాలలో 50 పోలింగ్ కేంద్రాలకు గానూ37245 ఓటర్లు ఉండగా 29 వేల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జగరకుండా పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశారు. ఎంపిపి కొక్కుల కీర్తి సురేష్ తమ స్వగ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే తాజా మాజీ సర్పంచ్, ప్రజాప్రతినిధులు తమ తమ గ్రామాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం పూట ఓటర్ల తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి బారులు తీరారు.

## కొల్చారం మండలంలో ప్రశాంతంగా ఎన్నికల పోలింగ్

**కొల్చారం, మే13 ప్రభాతవార్త:**

కొల్చారం మండల వ్యాప్తంగా సోమవారం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేయడంతో ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్న యవతి, యువకులు సెల్ఫీ పాయింట్ వద్ద ఫోటోలు దిగి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నారు. వీల్‌చైర్‌ల సాయంలో పోలింగ్ కేంద్రాలకు వచ్చి వికలాంగులు సైతం ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులుగౌడ్‌లు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ జరుగుతున్న సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేశంగౌడ్ మాట్లాడుతూ నీలం మధు గెలుపు ఖాయమని అన్నారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు, కిష్టాపూర్ గ్రామ మాజీ సర్పంచి గోదావరి మాట్లాడుతూ వెంకట్రామిరెడ్డి లక్ష ఓట్ల మెజారిటీతో గెలుపొందడం ఖాయమని అన్నారు.

### చిన్నశంకరంపేట మండలంలో 70 శాతం పోలింగ్

**చిన్నశంకరంపేట,మే13,ప్రభాతవార్త:**

సోమవారం మండల వ్యాప్తంగా 40 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రశాంతమైన వాతావరణంలో ముగిసింది. సిబ్బంది ఈవిఏంలను పోలిసుల బందోబస్తుతో జిల్లా కేంద్రానికి తరలించారు. 70 శాతం మేర పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

**చిన్నశంకరంపేట, మే 13,ప్రభాతవార్త:**

చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘ టన మండల పరిది చందంపేటలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ కథనం ప్రకారం.... గ్రామానికి చెందిన సాయి (35), ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈ నెల 10న పురుగుల మందు త్రాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే నార్సింగీలోని ప్రవేటు ఆసు పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం భాగ్యనగరం లోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో చికిత్సపొందుతూ సోమవారం నాడు మృతి చెందాడు. మృతునికి భార్య సంగీత, నాలుగు సంవత్సరాల లోపు ఉన్న ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, మే 13 ప్రభాతవార్త:** ఎమ్మెల్యే డాక్టరు పి.సంజీవరెడ్డి కుటుంబ సమేతంగా నారాయణఖేడ్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యేతో పాటు సతీమణి అనుమపరెడ్డి, సోదరుడు పి.చంద్రశేఖర్‌రెడ్డి,పి. సుధాకర్‌రెడ్డిలు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి...**



ఓటుహక్కు వినియోగించుకుంటున్న సురేష్‌కుమార్ శెట్కార్

**నారాయణఖేడ్, మే 13 ప్రభాతవార్త:** జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్‌శెట్కార్ నారాయణఖేడ్ పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెహ్రూ నగర్ పాఠశాలలోని 168 పోలీంగు బూత్‌లో కుటుంబ సభ్యులతో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నగేష్‌శెట్కార్, జీతేందర్ శెట్కార్, కుమారుడు రాకేష్‌శెట్కార్, కుమార్తె గిరిజా శెట్కార్ తదితరులు వినియోగించుకున్నారు.

**కుటుంబ సభ్యులతో కలిసి మాజీ ఎమ్మెల్యే...**



ఓటు హక్కును వినియోగించుకుంటు్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**కల్హేర్, మే 13 ప్రభాతవార్త:** కల్హేర్ మండలం ఖానాపూర్ (కె)లో బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులలో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట సతీమని జయశ్రీరెడ్డి, కుమారుడు రోషన్‌రెడ్డి, తాజా మాజీసర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ గుండమ్మ అంజయ్యసాగర్, నాయకులు రాజు సాగర్, శ్రీనివాస్‌సాగర్, ప్రశాంత్‌సాగర్, బ్రాహ్మం, వెంకట్‌రాములు, దత్తురెడ్డి, దేవేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**మార్డిలో ఓటు వేసిన మశ్చేందర్...**



ఓటు హక్కును వినియోగించుకుంటున్న మశ్చేందర్

**కల్హేర్, మే 13 ప్రభాతవార్త:** జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గుర్రపు మశ్చేందర్ సొంత గ్రామమైన కల్హేర్ మండల పరిధిలోని మార్డిలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హకున్కను వినియోగించుకున్నారు. ఆయన వెంట సతీమణి, ఆయన తల్లి సుశీల అంజయ్య, నాగిరెడ్డి, జలేందర్, తదితరులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## కడ్పల్‌లో ఓటు వేసిన ఎమ్మెల్యే సతీమణి




కడ్పల్‌లో ఓటు వేసిన ఎమ్మెల్యే సతీమణి తోట అర్చన

**సిర్గాపూర్, మే 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కడ్పల్‌లో కామారెడ్డి జిల్లా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు సతీమణి తోట అర్చన తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. తోట అర్చన స్వగ్రామం (పుట్టినిల్లు) మండలంలోని కడ్పల్ కావడంతో అర్చనకు కడ్పల్‌లో ఓటు హక్కు ఉండటంతో పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని సోమవారం గ్రామానికి చేరుకుని 95వ పోలింగ్ కేంద్రంలో తన ఓటును సద్వినియోగం చేసుకున్నారు. తను సైతం ఓటు వేసినట్లు పోలింగ్ బూత్ బయట తన వేలికి అంటిచిన సిరా చుక్కను చూపించారు.

## మండలంలో ప్రశాంతంగా పోలింగ్

**కొండపాక, మే 13, ప్రభాతవార్త :** పార్లమెంట్ సాధారణ ఎన్నికలు సోమవారం కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో ప్రశాంతంగా జరిగాయి. కొండపాక మండలంలోని 15 గ్రామాల్లో పురుషులు 12,736 మంది, మహిళ ఓటర్లు 13,339, ట్రాన్స్‌జెండర్ ఒక్క ఓటరు ఉన్నారు. మండలంలో మొత్తం 25,776 మంది ఓటర్లున్నారు. వీరికి గాను అధికారులు 31 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. అదే విధంగా కుకునూరుపల్లి మండల పరిధిలో 15 గ్రామాల్లో పురుషులు 7,160 మంది, మహిళ ఓటర్లు 7,451 ఉన్నారు. మండలంలో మొత్తం 14,611 వేల ఓటర్లకుగాను 19 పోలింగ్ బూత్‌లను అధికారలు ఏర్పాటు చేశారు. రెండు మండలాల్లో సమస్యాత్మక గ్రామాల్లో సిసి కెమెరాల పర్యవేక్షణలో ఓటింగ్ నిర్వహించారు. భారీగా పోలీసు బలగాలను మోహరించి ఏలాంటి అవాంచనియ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈ రోజు కొంత వాతవరణం కూడా కొంత మేరకు చల్లగా ఉండి ఉక్కపోతగాని, బాగా వేడికాని లేకపోవడంతో ఓటర్లకు కొంత మేరకు ఉపశమనం కలిగింది.



బెల్లాపూర్‌లో ఓటు వేసేందుకు నిలుచున్న ఓటర్లు



మనూర్‌లో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి



వాంగ్దల్‌లో బారులు తీరిన గిరిజన మహిళా ఓటర్లు



తక్కడపల్లిలో మాజీ ఉప సర్పంచ్, యువకులు....



వీల్‌చైర్‌లో ఓటువేసేందుకు వెళుతున్న జమునాబాయి



పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఓటర్లు



కోనాపూర్‌లో ఓటువేసిన పద్మాదేవేందర్‌రెడ్డి



ఓటుహక్కువినియోగించుకున్న జితేందర్‌గౌడ్ దంపతులు



రామాయంపేటలో ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న జనరల్ అబ్జర్వర్ సమీర్ మాధవ్‌కర్కోటే



కాట్రియాలలో వీల్‌చైర్‌లో ఓటువేసేందుకు వచ్చిన వృద్దురాలు



ఓటు హక్కు వినియోగించుకున్న బాదె చంద్రం

# ప్రశాంతంగా పార్లమెంట్ ఎన్నికలు

**మనూర్, మే 13, ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఉదయమే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ 10 గంటల తరువాత పుంజుకుంది. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డిలు వేరు వేరుగా పరిశీలించారు. చంద్రశేఖర్‌రెడ్డి వెంట నాయకులు ఆకాష్, సురేష్, సుధాకర్, నారాయణ, భారత్ తదితరులు ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వెంట జడ్పీటిసి సభ్యులు నాగేందర్, బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

**వాంగ్దల్‌లో బారులు తీరిన గిరిజన మహిళలు**

**సిర్గాపూర్, మే 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వాంగ్దల్ గ్రామంలో పోలింగ్ ప్రక్రీయ ప్రశాంతంగా ముగిసింది. గ్రామపరిధిలోని రూప్లాతండా, పెద్ద గైరాన్‌తండా, చిన్న గైరాన్ తండాల నుంచి గిరిజనులు ఉదయం 10 గంటలకు ఒక్కసారిగా పోలింగ్ కేంద్రానికి చేరుకోవడంతో పోలింగ్ బూత్ వద్ద పెద్ద ఎత్తున ఓటర్లు బారులు తీరాల్సి వచ్చింది స్థానికంగా పురుషుల కంటే మహిళలే అధికంగా కానవచ్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, నీడ కొరకు టెంట్లు ఏర్పాటు చేయడంతో ఓటర్లు సదుపాయాలను సద్వినియోగం చేసుకున్నారు.

**ఓటు వేసిన 99 ఏళ్ల అవ్వ...**

**మునిపల్లి, మే 13, ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని మక్త క్యాసారం గ్రామంలో 99 ఏళ్ల అవ్వ నాగమ్మ ఓటు వేయడం జరిగింది. తక్కడపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సంగన్న గ్రామస్థులతో పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**నాగల్‌గిద్ద మండలంలో...**

**నాగల్‌గిద్ద, మే 13, ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని శామ తండాకు చెందిన 96 సంవత్సరాల వృద్ధురాలు జమునాబాయి వీల్‌చైర్‌లో పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేయడం యువతన ఆకట్టుకుంది.

**నిజాంపేటలో...**

**నిజాంపేట(ఖేడ్), మే 13 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. గతంలో కంటే ఈసారి యువత ఓటు హక్కును అధికంగా వినియోగించుకున్నారు. ఆయా పార్టీలకు చెందిన ఓటర్లు ఎండలో ఓపికతో ఉండి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**కోనాపూర్‌లో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే...**

**రామాయంపేట/రామయంపేట మున్సిపాలిటీ మే 13, ప్రభాతవార్త :** మండలంలో సార్వత్రిక పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం వరకు చాలా గ్రామాల్లో 50 శాతం పైగానే పోలింగ్ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి స్వగ్రామం కోనాపూర్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా మున్సిపల్ కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, సౌమ్య దంపతులతోపాటు పిఏసిఎస్ చైర్మెన్ బాదె చంద్రం ఓటు హక్కును వినియోగించుకున్నారు. పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు మధ్యాహ్నం రామాయంపేటకువచ్చి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. పట్టణంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మియాదగిరి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గజవాడ నాగరాజు, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఓటుహక్కు వినియోగించుకున్న 99 ఏళ్ల అవ్వ



పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్

## పోలింగ్ సరళిని పరిశీలించిన కాంగ్రెస్ నేతలు

**కొల్చారం, మే 13 ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు రంగంపేట, సంగాయిపేట, వరిగుంతం గ్రామాల్లో సోమవారం పోలింగ్ సరళిని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులుగౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగలగారి మల్లేశంగౌడ్‌లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## మద్ది వీరారెడ్డిని పరామర్శించిన కాట శ్రీనివాస్‌గౌడ్

**గుమ్మడిదల, మే13 ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం అన్నారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల పార్టీ మాజీ అధ్యక్షులు మద్ది వీరారెడ్డికి ప్రమాదవశాత్తు ఆక్సిడెంట్‌కావడంతో వారి నివాసానికి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ సోమవారం వెళ్లి పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచనలు ఇచ్చారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుట్ట నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మద్ది ప్రతాప్ రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, జయశంకర్‌గౌడ్, దర్గా వీరేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

**పెద్దశంకరంపేట, మే 13 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రామోజిపల్లిలో పిడుగుపాటుతో మృతి చెందిన కుటంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం మక్త లక్ష్మాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. పిడుగుపాటుతో మృతి చెందిన సంఘటన వివరాలను జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నత అధికారులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన వివరించారు. ప్రభుత్వ తరపున వచ్చే అన్ని రకాల సహాయ సహకారాలు బాధితుల కుటుంబ సభ్యులకు అందజేసేలా కృషి చేస్తామన్నారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయిది మధు, దానంపల్లి నారాగౌడ్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న మున్సిపల్ చైర్మన్

**అమీన్‌పూర్, మే13 ప్రభాతవార్త:** మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని మహిళా భవనంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఓటర్లందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి కోరారు.



సిరా గుర్తును చూపుతున్న మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి



టేక్మాల్‌లో ఓట్లు వేసేందుకు బారుతీరిన ఓటర్లు

## టేక్మాల్‌లో..ఎన్నికలు ప్రశాంతం

**టేక్మాల్, మే 13 ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికలు టేక్మాల్ మండలంలో ప్రశాంతంగా జరిగాయి. టేక్మాల్ మండలంలో 29 పంచాయితీలకు గాను 37 మొత్తం పోలీంగ్ బుతులున్నాయి. మొత్తం ఓటర్లు 28,729 ఉండగా అందులో పురుషులు 13.819 మహిళలు 14910 ఉన్నారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ సమయాన్ని ఎన్నికల అధికారుల నిర్దేశించారు. పల్వంచలో ఈవియం సాంకేతిక లోపంతో కాసేపు మొరాయించింది. ఈవియం సరికాగనే ఎన్నికలు సజావుగా జరిగాయి. ఎన్నికల కేంద్రాలను మండల ఎన్నికల అధికారులు మండల తహాశీల్దార్ క్రిష్ణ, ఎంపిడిఓ రియాజోద్దిన్‌లు సందర్శించి పరిశీలించారు. ఎప్పటికప్పుడు ఓటింగ్ శాతాన్ని తెలుసుకున్నారు. మండలంలో మొత్తం శాతం ఓటింగ్ శాతం నమోదు అయింది. ఎక్కడ ఎలాంటి అవంఛనీయ సంఘటన జరుగకుండా భారీ బందోబస్తు నిర్వహించారు.

## పోలింగ్ సెంటర్లను పరిశీలించిన నీలం మధుముదిరాజ్

**పటాన్‌చెరు, మే 13,ప్రభాతవార్త:** మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలంమధు ఎన్నికలలో భాగంగా సోమవారం పటాన్ చెరు నియోజకవర్గంలో పర్యటించారు. పటాన్‌చెరులోని గవర్నమెంట్ డిగ్రీ కాలేజి, జిహెచ్ఎంసీ ఆఫిసు, మండల ప్రజాపరిషత్ ప్రైమరీ స్కూల్, ఎంపీడీవో ఆఫీస్ సముదాయం,శాంతినగర్, మంజీరాహైస్కూల్, జిన్నారం మండలం గడ్డపోతారం, జిన్నారం మండలంలోని పోలింగ్ సెంటర్లను నీలం మధు సందర్శించారు. పెదింటిబిడ్డ అయిన తనను ఎన్నికలలో గ్రాండ్ విక్టరీ సాధించి, మెదక్‌గడ్డపై హిస్టరి క్రియేట్ చేయబోతున్నానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ప్రశాంతంగా పార్లమెంట్ ఎన్నికలు

**గుమ్మడిదల, మే13 ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండల వ్యాప్తంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు మూడుపార్టీలు నువ్వా నేనా అన్నట్లు ఎన్నికల ప్రచారం నిర్వహించాయి. గ్రామ పంచాయితీల్లో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నీలం మధు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డిలు గుమ్మడిదలలోని పోలింగ్ బూత్‌లను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గుమ్మడిదల మండలంలోని గ్రామాల వారీగా ఎన్నికల పోలింగ్ సరళి ఇలా ఉంది.. అన్నారంలో 68.5 శాతం, దోమడుగులో 69.8 శాతం, బొంతపల్లిలో 69.6 శాతం, వీరన్నగూడెంలో 81 శాతం, గుమ్మడిదలలో 78 శాతం, మంబాపూర్‌లో 83 శాతం, నల్లవల్లిలో 90 శాతం, కొత్తపల్లి 84 శాతం, అనంతారంలో 86 శాతం, కానుకుంటలో 85 శాతం, వీరరెడ్డిపల్లిలో 86 శాతం ఓట్లు పోలైనట్లు తెలిపారు.



ఓటు వేసిన తరువాత సిరా గుర్తును చూపుతున్న ఓటర్లు



సమయానికి ఓటు వేయడానికివచ్చిన యువకులను తిప్పిపంపిన కానిస్టేబుల్

## సమయానికి వచ్చినా ఓటు హక్కుకు నోచుకోని యువకులు

**రామాయంపేట, మే 13, ప్రభాతవార్త :** పార్లమెంటు సార్వత్రిక ఎన్నికల్లో బాగంగా రామాయంపేట మండలం సుతార్‌పల్లి గ్రామంలోని పోలింగ్ స్టేషన్‌లోకి ఇద్దరు యువకులు సమయానికి పోలింగ్ స్టేషన్‌కు చేరుకున్నా, వారు ఓటుహక్కును వినియోగించుకోలేకపోయారు. వివరాల్లోకి వెళ్తే... రామాయంపేట మండల పరిధిలోని సుతార్‌పల్లి గ్రామంలో ఉన్న పోలింగ్ స్టేషన్ ఆవరణలోకి సరిగ్గా 6 గంటలకు ఇద్దరు యువకులు చేరుకున్నారు. అదే సమయంలో ఎన్నికల అధికారి డోరు బంద్ చేశారు. సమయానికి పోలింగ్ స్టేషన్ ఆవరణలోకి వచ్చామని, తమను చేసిన సిబ్బంది తలుపులు మూసివేశారని, దీంతక్ష తాము ఓటు హక్కును వినియోగించుకోలేకపోయామని ఇద్దరు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయంలో కొద్దిసేపు యువకులకు, ఎన్నికల సిబ్బందికి వాగ్వివాదం జరిగింది. అయినా అధికారులు వారికి ఓటు హక్కు కల్పించడానికి అంగీకరించలేదు. దీంతో వారు నిరాశకు లోనయ్యారు. ఓటు వేయడానికి యువకులు వచ్చిన సమయంలో విలేకరులు కూడా అక్కడే ఉన్నారు. ఈ విషయమై అక్కడి పోలింగ్ స్టేషన్ ఎన్నికల అధికారిని వివరణ కోరగా, సమయం అయిపోయాక తాను బయటకు వచ్చి, ఇంకా ఎవరైనా ఓటర్లు ఉన్నారా..? అని కానిస్టేబుల్‌ను అడిగానని, అయితే అతను ఎవరు లేరన్నాకే తలుపులు వేసామని వివరణ ఇచ్చారు.

## ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్



ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్ దంపతులు

**పటాన్‌చెరు, మే 13,ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సోమవారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తమ కుటుంబసభ్యులతో కలిసి పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఓటర్లందరూ తమ విలువైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలని ఆయన కోరారు.

**భారీ మెజార్టీతో బిఆర్ఎస్ గెలువబోతుంది...**

**పటాన్‌చెరు, మే 13,ప్రభాతవార్త:** పటాన్‌చెరు నియోజకవర్గంలోని వివిధ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పరిశీలించారు. నియోకవర్గం పరిధిలోని పటాన్‌చెరు, రామచంద్రాపురం, భారతీ నగర్ డివిజన్లతో పాటు తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వివిధ పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక శాతం ప్రజలు బిఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని ఆయన తెలిపారు. నూతనంగా ఓటు హక్కు పొందిన యువత సైతం గులాబీ పార్టీకి మద్దతు పలుకుతున్నారని తెలిపారు. మెదక్ పార్లమెంట్‌ను భారీ మెజార్టీతో కైవసం చెసుకోబోతున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ బిఆర్ఎస్ అభ్యర్థి వెంకట్ రాంరెడ్డి, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.